## క్లుప్తంగా

### అలరించిన విద్యార్థులు

బిజినేపల్లి: మండలంలోని పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ అలరించారు. సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలో తమ అనుభవాలు పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ తహసీల్దార్‌కు జీకే మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పట్టాదారు పాస్ పుస్తకాలను వెంటనే అందజేయాలని కోరారు. సతీష్, శివ, ఉస్సేన్, సల్మాన్ ఖాన్ పాల్గొన్నారు.

### మద్యం దుకాణంలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగనూలు చౌరస్తాలోని ఓ వైన్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు షెట్టర్ తాళం విరగొట్టి అందులోకి ప్రవేశించి గల్లాపెట్టెలో ఉన్న రూ.40 వేల నగదుతో పాటు రూ. 20 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. ఎప్పటిలాగే మద్యం దుకాణాన్ని తెరిచేందుకు నిర్వాహకులు రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

### ఆలయానికి రూ.లక్ష విరాళం



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి చారకొండ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన రంగినేని నిర్మలరావు, శ్రీక్షిత దంపతులు రూ.లక్ష విరాళంగా ఆలయం కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డికి మంగళవారం అందజేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రంగినేని నిర్మల్ రావు, కమలాకర్ రావు, వెంకటేశ్వర్ రావు, సరిత, రేణుకలు పాల్గొన్నారు.

### మండల స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు

తాడూరు: మండలంలోని శిర్సవాడ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జీహెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండ అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశ్యంతో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిర్సవాడతో పాటు బలాన్‌పల్లి, ఐతోలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ స్థానం శిర్సవాడ, రెండో స్థానం ఐతోలు విద్యార్థులు నిలిచారు. ఎంపికైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో గడ్డికోపులవారి నూతన ఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పగిడాల శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యంపై మంగళవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన తేజ ఈ నెల 23న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. భర్త గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆలయ చైర్మన్‌గా కృష్ణారెడ్డి

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో వెలసిన అతిపురాతనమైన చరిత్ర కలిగిన త్రిపుట వేంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా తలసాని కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. మంగళవారం దేవాలయంలో గ్రామస్తులు సమావేశమయ్యారు.

# మార్మోగిన శివ నామస్మరణ





పూజలు చేస్తున్న వేద పండితులు

వెల్దండ: మండలంలోని గుండాల అంబారామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ప్రదక్షిణ, గోపూజ, మహాగణపతిపూజ, యాగశాల ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలను నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని పరవశించిపోయారు. శివ రాత్రి ఉత్సవాలకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ నాయకులు పర్వత్‌రెడ్డి, దేవాలయ వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్, లింగం, అర్చకులు బాలస్వామి శర్మ, కృష్ణయ్యశర్మ, శివకుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ, తదితరులు ఉన్నారు.

**నేటి నుంచి అన్నదానం**

అంబా రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 26 నుంచి 15 రోజుల పాటు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు, జియగూడ యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల చిన్న జంగయ్యయాదవ్ పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

**ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌ఐ**

అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాల ఏర్పాట్లను ఎస్‌ఐ కురుమూర్తి పరిశీలించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. 50 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయ ఆవరణంలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరత లేకుండా చూస్తాం



సింగిల్‌విండో కార్యాలయంలో ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ శోభారాణి

వెల్దండ: రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తామని మండల వ్యవసాయ అధికారిణి శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆగ్రో సేవా కేంద్రాలను, సింగిల్‌విండో కార్యాలయాన్ని ఏఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామన్నారు. ఆగ్రో సేవా కేంద్రాల్లో, సింగిల్‌విండో కార్యాలయాల్లో యూరియాతో పాటు ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూరియా 1426 బస్తాలు, డీఏపీ 138, పోటాష్ 59, 28-28-0 రకం ఎరువులు 136 బస్తాలు, 20-20-0-13రకం ఎరువులు 18 అమ్మోనియ 20 బస్తాల చొప్పున మండలంలో ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. అవసరం ఉన్న రైతులు ఆగ్రోసేవా కేంద్రాల్లో, సింగిల్‌విండో కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు, సింగిల్‌విండో, ఆగ్రోసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఈదమ్మ దేవతకు బోనాలు



కొల్లాపూర్: కొల్లాపూర్‌లో ఈదమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా మంగళవారం భక్తులు బోనాలలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లు బలిఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని కాంగ్రెస్ నాయకులు నర్సింహారావు, నాగరాజు, సాయిలుయాదవ్, నాయకులు దర్శించుకున్నారు.

### శివాలయంలో పూజలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం చేశారు. లోక కల్యాణార్థం రుద్రహోమం చేశారు. మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలు అందరూ గాజులతో అలంకరించుకొని గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వనం పర్వతాలు, చిలువేరు ధనరాజ్, కర్నాటి రాములు, కర్నాటి నారాయణ, వనం వేణు, గుజ్జరి నర్సింహ, మాకం మల్లయ్య, ఇమ్మడి రమేష్, కర్నాటి నవీన్, శకుంతల, గీత పాల్గొన్నారు.

### ఘనంగా పల్లకీసేవ

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లిలో మంగళవారం శివ మాలధారణ స్వాములు శివపార్వతుల పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచు, గురుస్వామి పర్వతాలు ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా నెల్లికొండపై ఉన్న శివాలయానికి చేర్చారు. మహిళ లు భ్రమరాంభిక, మల్లికార్జున బోనాలను సమర్పించారు.

### వేరుశనగ కాయలు దగ్ధం



వెల్దండ: షార్ట్‌సర్క్యూట్‌తో వేరుశనగ కాయలు దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని తిమ్మినోనిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రైతు బొల్లం జంగారెడ్డి ఎనిమిది ఎకరాల పొలంలో వేరుశనగా పంట సాగు చేశాడు. పంట నూర్పిడి చేసి కుప్పగా వేశారు. గాలికి విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు కాయలపై పడి మంటలు వ్యాపించాయి. గమనించిన రైతులు బోరుమోటర్‌తో మంటలను అదుపుచేశారు. దాదాపుగా 150బస్తాల వరకు వేరుశనగా పంట దగ్ధమైనట్లు బాధిత రైతులు పేర్కొన్నారు.

# సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాలు



మాట్లాడుతున్న బాల్‌నరసింహ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని కుమ్మెరలో మంగళవారం సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలనరసింహ హాజరై మాట్లాడారు. 1925 నాగపూర్ పట్టణంలో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. 99 సంవత్సరాలుగా పేదల పక్షాన పార్టీ పనిచేసి ఎన్నో విజయాలను సాధించిందని, ఆనాడు పార్లమెంటులో 64 మంది ఎంపీలు ఉండి భూసంస్కరణ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. భవిష్యత్తులోను పేదల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, మండల కార్యదర్శి వెంకటయ్య, గ్రామ పార్టీ కార్యదర్శి భౌరమ్మ, నాయకులు శివశంకర్, కృష్ణాజీ, శివకృష్ణ నాయకులు పాల్గొన్నారు.

### మైనింగ్ అధికారులు తనిఖీ

బిజినేపల్లి: మండలంలోని రాళ్ల గుట్టలో రాళ్లు కొడుతున్నారనే ఆరోపణలపై స్థానిక ఆర్‌ఐ బాలరాజుతో కలిసి జిల్లా మైనింగ్ కార్యాలయం రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నాగచైతన్య మంగళవారం లట్టుపల్లి, గంగారం గ్రామాల్లోని రాళ్ల గుట్టల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా రాళ్లు కొడుతున్న కూలీలను హెచ్చరించి వారి వివరాలు నమోదు చేసుకున్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

తిమ్మాజిపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ఏబీవీపీ కన్వీనర్ వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఏబీవీపీ నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు అక్షయ, యువరాజ్, నవీన మహేష్, పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

కొల్లాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్ కుమార్ పార్టీ నాయకులను కోరారు. మంగళవారం కొల్లాపూర్‌లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. కార్యక్రమంలో కొల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌గౌడ్, నాయకులు నర్సింహ్మ, ప్రభాకర్, జైపాల్, అనిల్, నానిగౌడ్, ఉదయ్, వెంకట్‌యాదవ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తిరూరల్: మద్యం తాగి పట్టుబడిన ఇద్దరిని కోర్టులో హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.200 జరిమానాతో పాటు ఒకరికి రెండు రోజులు, మరొకరికి ఒక రోజు జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. జడ్చర్లకు చెందిన శేఖర్‌కు రెండు రోజుల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించగా, తెలకపల్లి మండలానికి చెందిన కేశవులుకు ఒక రోజు జైలు శిక్ష, రూ.100 ల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

### వైభవంగా గరుడోత్సవం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో వెలసిన లక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి గరుడ సేవ నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ చైర్మన్ కల్వ మనోహర్, తదితరులు ఉన్నారు.

### గ్రంథాలయ స్థలాన్ని కాపాడాలని వినతి

తెలకపల్లి: గ్రంథాలయ స్థలాన్ని కాపాడాలని పెద్దపల్లి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ జాకీర్ అలీకి, ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రంథాలయానికి కేటాయించిన స్థలంలో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెద్దపల్లి బంగారయ్య, సుధాకర్, శ్రీనివాసరావు, సత్యం, శివ, వెకంటస్వామి రాజు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



లింగాల: మహిళలకు ఆర్థిక అక్షరాస్యత ఎంతో అవసరమని లింగాల ఎస్‌బీఐ మేనేజర్ మృదల్ మోహన్ అన్నారు. మండలంలోని సూరాపూర్‌లో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో ఆర్బీఐ అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా పొదుపుపై మహిళలకు పలు అంశాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు మన్సూర్, రూపేష్, శ్రీశైలం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

### ‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయండి




నాగర్‌కర్నూల్‌రూరల్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మార్చి 28న చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం లక్ష్మణాచారి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణరంగ కార్మికులు 1996 బీఓసీ డబ్ల్యూ చట్టాన్ని కార్మికుల సంక్షేమ మండలిని బలోపేతం చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర లబ్ధిదారులకు రూ.6 వేల పింఛన్, ఈఎస్‌ఐ సదుపాయాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మారేడు శివశంకర్, శేఖర్, శ్రీనివాసులు, శివయ్య, లక్ష్మయ్య తదితరు పాల్గొన్నారు.

### కూలి డబ్బులు చెల్లించాలి

కొల్లాపూర్: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈజీఎస్ కూలి డబ్బులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు జల్లాపురం సురేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అమరగిరిలో ఈజీఎస్ కూలీలతో సమావేశం అయ్యారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

### ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో పూజలు చేశారు. ఆలయంలో శివసంకల్పం, గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, పంచగార్య, నవగ్రహ కలశస్థాపన, రక్షక బంధన, అగ్నిప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జంగం శివయ్య పాల్గొన్నారు.

### జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్‌ఫెయిర్

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం విద్యార్థులు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు అంశాలపై విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తిలకించారు. సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాగ్యరేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి



తాడూరు: విద్యార్థులు ఇష్టంతో బాగా చదివి రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి. ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రావు, అధ్యాపకుడు మురళి కృష్ణ, ఈశ్వర్, సత్యం, శ్రీధర్ రెడ్డి, ర మేష్, రివిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వాల్ పోస్టర్ విడుదల



మన్ననూర్: రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల కల్యాణం, బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం మన్ననూర్‌లో విడుదల చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మద్దెల ఆనంద్, కమిటీ సభ్యుడు యాదయ్య, మద్దెల శేఖర్, రామనాథం, పురుషోత్తం, శేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

### కూలీలందరికీ పని కల్పించాలి

అమ్రాబాద్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలందరికీ పనులు కల్పించాలని అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మొత్తం 70 రకాల పనులు, రూ.5. 50 కోట్ల పనులకు సామాజిక తనిఖీ బృందం వారం రోజుల నుంచి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి ప్రజావేదికలో వెల్లడించారు. వివిధ పనుల్లో అక్రమాలు జరిగాయని రూ. 79402ల రికవరికి ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎస్ఆర్‌పీ బద్రు, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### ఉపాధ్యాయులకు పరామర్శ

తిమ్మాజిపేట: మండలంలోని బుద్దసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం జోత్స్న, ఉపాధ్యాయులు విజయ కుమారి, తిరుపతయ్యలు మంగళవారం జడ్చర్ల నుంచి ఆటోలో బుద్దసముద్రం గ్రామానికి బయలు దేరారు. మార్గమధ్యలో నసురుల్లాబాద్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. ఉపాధ్యాయులను ఎంఈఓ సత్యనారాయణశెట్టి, నాయకులు జోగుప్రదీప్, జోగుగోపి, కొత్త వెంకటేష్, ప్రసాద్, బాలస్వామి, గ్రామానికి చెందిన పలువురు బాధితులను పరామర్శించారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో ప్రతిభ

ఉప్పునుంతల: వికారాబాద్‌లో ఈ నెల 20 నుంచి 23 వరకు జరిగిన 34వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు నిలిచింది. మండలంలోని వెల్టూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్ అఖిల్, నందిని క్రీడల్లో పాల్గొనట్లు హెచ్ఎం రవిశేఖర్ తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. పీఈటీ రమేష్, ఉపాధ్యాయులు జంగయ్య, వెంకటయ్య, రాజేందర్, సురేందర్, శేఖర్, జ్యోతి, సీఆర్‌పీ శ్రీను తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శివాలయాలు ముస్తాబు



ముస్తాబైన అమ్రాబాద్ అమరేశ్వరాలయం

లింగాల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలు ముస్తాబు చేశారు. మండల కేంద్రానికి సమీపంలో చెన్నంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న అత్యంత పురాతనమైన శివాలయంలో స్వామి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఏకలవ్య వీధిలో ఉన్న శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను మంగళవారం సాయంత్రం ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. అంబట్‌పల్లి, పాతరాయవరం, దారారం, తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు.

**చెంచుల కోసం ప్రత్యేక బస్సులు**

మండలంలోని నల్లమల ప్రాంతంలో ఉన్న బౌరాపూర్ భ్రమరాంబిక, మల్లికార్జున ఆలయం దగ్గర అధికారికంగా జరిగే చెంచుల జాతరకు చెంచులను ఉచితంగా తరలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చెంచులు ప్రత్యేక బస్సులలో బౌరాపురం తరలివెళ్లారు.

అమ్రాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అమ్రాబాద్, పదర మండలాల్లో శివాలయాలను భక్తులు ముస్తాబు చేశారు. మండల కేంద్రమైన అమరేశ్వరాలయం, అంతర్‌గంగా, పదర మండలంలోని మద్దిమడుగు శివాలయం, కేదార్వేరాలయం మారడుగు సమీపంలోన్న ఆలయాలకు విద్యుత్ కాంతులతో అలంకరించారు.

### డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని అటవీశాఖ విశ్రాంతి గృహం వద్ద మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడంలో రిస్క్యూ టీంలు, అధికారులు చేస్తున్న ప్రయత్నాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో విశ్రాంతి గృహంలో అల్పాహారం చేసిన ఆయన అనంతరం పార్టీ నాయకులతో కలిసి కాసేపు చర్చించారు. ఎస్ఎల్‌బీసీ వంటి దుర్ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరం అన్నారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు ఇప్పటికే చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, సత్యానారాయణ, రహీం, హన్మంత్‌రెడ్డి, వెంకటయ్య, బాలస్వామి, గోపాల్‌రెడ్డి, తిరుపతి, శివ తదితరులు పాల్గొన్నారు.